సాక్షి అనకాపల్లి

మంగళవారం ၊ 31 ၊ డిసెంబర్ ၊ 2024

ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా

మహారాణిపేట : ఉత్తరాంధ్ర టీచర్ ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. గత ఎమ్మెల్సీఎన్నికల్లో 19,523 మంది ఓటర్లు ఉండగా..స్వల్పంగా పెరిగారు. గత నెల 23న ప్రకటించిన జాబితాలో మొత్తం 15,287 మంది ఓటర్లలో పురుషులు 9,638 మంది, స్త్రీలు 5,649 మంది ఉన్నారు. ఆ తర్వాత ఆన్‌లైన్ ద్వారా 1,930 దరఖాస్తులు, ఆఫ్‌లైన్ ద్వారా 4,064 దరఖాస్తులు స్వీకరించారు. అదనంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది జాబితాను సోమవారం విడుదల చేశారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘు వర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటితో పూర్తవుతోంది. వచ్చే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నాటికి ఓటర్ల నమోదు ప్రక్రియ నిర్వహిస్తారు.



న్యాయవాదుల నిరసన

అనంతపురం జిల్లాలో పోలీసు స్టేషన్లో న్యాయవాది శేషాద్రి మృతికి నిరసనగా అనకాపల్లి, నర్సీపట్నంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. 8లో

న్యూస్‌రీల్

న్యూ ఇయర్ వేడుకలకు దూరం



స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మాజీ డిప్యూటీ సీఎం బూడి

నర్సీపట్నం : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనవరి 1వ తేదీ వరకు సంతాప దినాలు ప్రకటించినందున న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవడం సమంజసం కాదని స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి ఒకటిన ఎవరూ తనను వ్యక్తిగతంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపవద్దని కోరారు.

దేవరాపల్లి : మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉంటున్నట్టు జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సరం రోజున (బుధవారం) మాజీ డిప్యూటీ సీఎం బూడి జిల్లాలో అందుబాటులో ఉండరని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గమనించి అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు మాడుగుల నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపేందుకు రావొద్దని విజ్ఞప్తి చేశారు.

ఈవీఎం గొడౌను తనిఖీ



ఈవీఎం గొడౌను తనిఖీ చేస్తున్న కలెక్టర్

తుమ్మపాల : జిల్లా ఎస్పీ కార్యాలయం సమీపంలో గల ఈవీఎం గొడౌన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ కృష్ణన్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సోమవారం తనిఖీ చేశారు. గోడౌను త్రైమాసిక తనిఖీలలో భాగంగా గొడౌను సీళ్లను తీసి, నియోజకవర్గాల వారీగా భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లను, సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలను, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గొడౌనుకు సీళ్లు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ డివిజనల్ అధికారి వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, అగ్నిమాపక అధికారి పి.నాగేశ్వర రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.నాయుడు, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, జి.రాజు, కె.హరినాథ బాబు, పి.నాగేశ్వరరావు, వి. వెంకట సత్యనారాయణ, టి.రమణ పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం : మహా కుంభమేళాకు వెళ్లే భక్తులు, తీర్థయాత్రికుల కోసం పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- తిరుపతి–బనారస్(07107) స్పెషల్ రైలు జనవరి 18, ఫిబ్రవరి 8, 15, 22వ తేదీల్లో (శనివారం) రాత్రి 8.55 గంటలకు తిరుపతిలో బయల్దేరి మరుసటి రోజు (ఆదివారం) ఉదయం 10.58 గంటలకు దువ్వాడకు, సోమవారం మధ్యాహ్నం 3.45 గంటలకు బనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బనారస్–విజయవాడ(07108) స్పెషల్ రైలు జనవరి 20, ఫిబ్రవరి 10, 17, 24వ తేదీల్లో (సోమవారం) సాయంత్రం 5.30 గంటలకు బనారస్‌లో బయల్దేరి మంగళవారం రాత్రి 11.23 గంటలకు దువ్వాడకు, బుధవారం తెల్లవారు 5.30 గంటలకు విజయవాడ చేరుకుంటాయి.
- నరసాపూర్–బనారస్(07109) స్పెషల్ రైలు జనవరి 26, ఫిబ్రవరి 2వ తేదీల్లో (ఆదివారం) ఉదయం 6 గంటలకు నరసాపూర్‌లో బయల్దేరి అదేరోజు ఉదయం 10.58 గంటలకు, సోమవారం మధ్యాహ్నం 3.45 గంటలకు బనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బనారస్–నరసాపూర్(07110) స్పెషల్ రైలు జనవరి 27 ఫిబ్రవరి 3వ తేదీల్లో (సోమవారం) సాయంత్రం 5.30 గంటలకు బనారస్‌లో బయల్దేరి, మరుసటిరోజు (మంగళవారం) రాత్రి 11.23 గంటలకు దువ్వాడకు, బుధవారం తెల్లవారు 5 గంటలకు నరసాపూర్ చేరుకుంటుంది.

ఉత్తమ విద్యావిధానాలతో జాతీయ స్థాయి అవార్డు

చీడికాడ : మండలంలోని మంచాల పాఠశాలలో అనుసరిస్తున్న ఉత్తమ విద్యావిధానాలు అమలుపై జాతీయస్థాయిలో అవార్డుకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కె.వెంకటలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పాఠశాలలో అమలు చేస్తున్న విద్యావిధానాలు అనే అంశంపై పాఠశాల నుంచి పంపించిన వీడియోకు జాతీయస్థాయిలో ఉత్తమ వీడియో డాక్యుమెంటరీగా ఏపీ నుంచి పాల్గొన్న అన్ని ఆదర్శపాఠశాలలకు గాను మంచాల పాఠశాల ఎంపికైనట్టు ఆమె తెలిపారు. ఈ అవార్డును జనవరి మొదటి వారంలో న్యూఢిల్లీలో అందుకోనున్నట్లు ఆమె చెప్పారు.

ఒడ్డునే పడ్డ చేపల్లా మత్స్యకారుల బతుకులు | ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా కూటమి ప్రభుత్వం | ఇప్పటికీ అందని 'మత్స్యకార భరోసా' | కాలుష్యంతో సముద్రంలో తగ్గిన మత్స్య సంపద | ఉపాధి లేక వలస బాటలో మత్స్యకారులు | వరుస తుపానులతో వేట లేక పస్తులు



రాంబిల్లి (యలమంచిలి) :

వేట సాగదు..పూట గడవదు..

భరోసా ఏది బాబూ

> ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో **మత్స్యకారులకు** వేట నిషేధ సమయంలో **రూ.20 వేలు** అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, తీరా అధికారం చేపట్టాక ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తోంది. మత్స్యకారులపై వేట నిషేధ పరిహారం అందించకుండా ముఖం చాటేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత కలిగిన మత్స్యకారులకు బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు చొప్పున మే నెలలోనే జమ చేయడం జరిగేది.

మత్స్యకారుల ఓట్ల కోసం కూటమి ప్రభుత్వం అమలు కాని బూటకపు హామీలు గుప్పించింది. కానీ గత 8 నెలలు గడుస్తున్నా మత్స్యకారులకు అందాల్సిన మత్స్యకార భరోసా ఇప్పటికీ అందలేదు. ప్రతి ఏటా ఏప్రిల్ 15 నుంచి, జూన్ 14 వరకు 61 రోజులు సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లకుండా వారికి ప్రభుత్వం పరిహారం అందిస్తుంది. అనకాపల్లి జిల్లాలో యలమంచిలి నియోజకవర్గంలో రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో పూడిమడక, తంతడి, వాడపాలెం, కొత్తపట్నం, వాడ నర్సాపురం, వెంకయ్యపాలెం, గజిరెడ్డిపాలెం, లోవపాలెం తదితర సముద్ర తీర గ్రామాల ప్రజలు సముద్రంలో చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వేట నిషేధిత సమయంలో అందించే పరిహారం మత్స్యకార భరోసా రూ.20 వేలకు పెంచి ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం అర్హుల జాబితాను తయారు చేయడంలో తాత్సారం చేస్తోంది. వేట నిషేధ సమయంలో ఆర్థిక ఇబ్బందులు పడిన మత్స్యకారులు ఇటీవల వరుస తుపానుల కారణంగా వేట సాగక పస్తులుంటున్నారు. వారికి ఆర్థిక భరోసా అందించడంలో ప్రభుత్వం విఫలమైంది.

కాలుష్యంతో మత్స్య సంపదకు చేటు...

రాంబిల్లి మండలంలో వాడనర్సాపురం కొత్తపట్నం, గ్రామాలు దగ్గరలో నేవల్‌బేస్ నిర్మాణంలో భాగంగా పెద్ద పెద్ద షిప్‌లు నిలుపుదల చేయడానికి, రాకపోకలకు వీలుగా నేవీ అధికారులు సముద్రంలో డ్రెడ్జింగ్ పనులు చేపట్టడం వల్ల సముద్రంలో అలల తాకిడికి పోటు పెరిగి రాంబిల్లి తీరంలో చేపల ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో మత్స్య వేటకు ఇక్కడి మత్స్యకారులు బంగ్లాదేశ్, కోల్‌కతా వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి రెండు మూడు రోజుల వరకు అక్కడ సముద్రంలో బోట్ల పై ఉండి వేట సాగించి వస్తున్నారు.



సముద్రం ఒడ్డున వలలు సరిచేసుకుంటున్న మత్స్యకారులు



భరోసా పరిహారం ఇవ్వాలని ఆందోళన చేస్తున్న మత్స్యకారులు (ఫైల్)

మరికొందరు సమీపంలో పూడిమడక, తంతడి తీరం వరకు వెళ్లి చిన్న చిన్న చేపలు వేటాడి జీవనం సాగిస్తున్నారు. అలాగే అచ్యుతాపురం మండలం, రాంబిల్లి ఉమ్మడి మండలాల్లో ఎస్ఈజెడ్‌లో పరిశ్రమలు రావడం వాటి ద్వారా కాలుష్యం, కంపెనీ వ్యర్థాలు సముద్రంలోకి వదలడం వల్ల సముద్రంలో చేపలు చనిపోతున్నాయి. పరిశ్రమలు వెదజల్లే వాయు, తాగునీరు కలుషితమై మత్స్యకార గ్రామాల ప్రజలు కిడ్నీ సంబంధిత వ్యాధులు, కేన్సర్, ఊపిరి తిత్తులు, శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని కొంతకాలంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం సముద్రంలో వేటకు వెళ్లాలంటే వందల మైళ్ల దూరం ప్రయాణిస్తే కాని చేపలు దొరకని పరిస్థితి ఉందని చెబుతున్నారు. సుదూర ప్రాంతాలకు వేటకు వెళ్లినపుడు తుపానులు, సముద్ర ఆటుపోట్లకు ప్రమాదాలు సంభవించి ఎందరో మత్స్యకారులు ప్రాణాలు కోల్పోతున్నారు.

> **అనకాపల్లి జిల్లాలో 73 కిలోమీటర్ల పొడవున సముద్రతీరం ప్రాంతంలో 32 మత్స్యకార గ్రామాల్లో 86,497మంది మత్స్యకార జనాభా ఉంది. వీరిలో 2,238 బోట్లు కలిగిన 12,996 మంది మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్తున్నారు. వీరిలో గతంలో 10,750 మందిని పరిహారానికి అర్హులుగా మత్స్యశాఖ గుర్తించింది.**

వారికి సకాలంలో ప్రభుత్వం నుంచి బీమా కూడా అందించడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇటీవల ప్రకృతి విపత్తులు, తుపానుల కారణంగా రోజుల తరబడి మత్స్యకారుల సముద్రంలో వేట సాగక, ఇతర పనులకు వెళ్లలేక పస్తులు ఉండే పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం మత్స్యకారులు పడుతున్న అవస్థలు గుర్తించి వారికి వేట నిషేధ పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఉపాధి లేక వలస బాట

సముద్రంలో చేపల ఉత్పత్తి తగ్గడం, చేపల కోసం సుదూర ప్రాంతాలకు వేటకు వెళ్లడం కష్టంగా మారడం వల్ల స్థానికంగా ఉన్న మత్స్యకార గ్రామాల ప్రజలు నాగార్జునసాగర్, నందికొండలో రిజర్వాయర్, కర్నూలు ఆల్మట్టి డ్యాం, కడప బ్రహ్మంగారి మఠం వద్ద రిజర్వాయర్, ఏలేశ్వరం డ్యాం, కర్ణాటకలో ఉన్న రిజర్వాయర్ల వద్దకు చేపల వేటకు వెళుతున్నారు. ఇక్కడ స్వగ్రామంలో భార్య, పిల్లలను వదిలేసి ఉపాధి నిమిత్తం పొట్ట చేత పెట్టుకొని వెళుతున్నారు. నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండాల్సిన దుస్థితి నెలకొంది.



భరోసా ఇంకెప్పుడు?



రాష్ట్రంలో మత్స్యకారులు అందరికీ వేటనిషేధ సమయంలో మత్స్యకార భరోసాను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.20 వేలు అందిస్తామని అన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో రూ.10వేలు మత్స్యకారులకు పరిహారంగా అందజేసేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పరిహారం అందించి ఆదుకోవాలి.

–చోడిపిల్లి గంగరాజు, ఆంధ్రప్రదేశ్ మత్స్యకార్మిక సంఘం సభ్యుడు, కొత్తపట్నం

ఉపాధి కరువైంది



పరిశ్రమల కాలుష్యం వల్ల వ్యర్థ జలాలు సముద్రంలో కలవపడంతో సముద్రంలో చేపల ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వెళ్లాల్సి వస్తుంది. వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందిస్తున్న పరిహారం ఇంకా అందలేదు. మత్స్య కారులకు ప్రభుత్వం అందిస్తానన్న పరిహారం వెంటనే అందించి ఆదుకోవాలి.

–సూరాడ అప్పలరాజు, మత్స్యకారుడు వాడపాలెం

వేటక సాగక ఇక్కట్లు



వేట నిషేధిత సమయంలో మత్స్యకారులకు గత ప్రభుత్వంలో ముందుగానే డబ్బులు అకౌంట్‌లో పడేవి. ప్రస్తుతం మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తానన్న పరిహారం ఇంకా అందలేదు. తుపానులతో వేటకు వెళ్లక ఇళ్లకే పరిమితమయ్యాం.చాలా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. రూ.20 వేలు అందిస్తానన్న ప్రభుత్వం ఇంకా డబ్బులు వేయలేదు.

–చింతకాయల అప్పలరాజు, మత్స్యకారుడు

కాలుష్యంతో ఉపాధికి చేటు



రాంబిల్లి మండలంలో ఎస్ఈజెడ్ పరిశ్రమల కాలుష్యం వల్ల సముద్రంలో చేపలు చనిపోయి ఉత్పత్తి తగ్గిపోయింది. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో అందించే పరిహారం కూడా కూటమి ప్రభుత్వం ఇంతవరకూ అందివ్వలేదు. మరోవైపు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో ఇతర ప్రాంతాలకు మత్స్యకారులు వలస వెళ్లిపోతున్నారు.

–చింతకాయల శివాజీ, మత్స్యకార సంఘం నాయకుడు, డీవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే అందిస్తాం

మత్స్యకార భరోసాకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి ఉత్తర్వులు వెలువడలేదు. జనవరిలో అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వానికి మత్స్యకారుల అర్హుల జాబితాను గుర్తించడం జరుగుతుంది. పెంచిన పరిహారంపై ప్రభుత్వం పరిశీలనలో ఉంది. త్వరలోనే మత్స్యకార భరోసాను అందించేందుకు కృషి చేస్తుంది.

–పి.ప్రసాద్, మత్స్యశాఖ ఏడీ

బల్క్ డ్రగ్ పార్కు పనులు ప్రారంభం

- లేఅవుట్ వేసి ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం
- పనులు జరిగే చోట 50 మందితో పోలీసు బందోబస్తు
- అడ్డుకోకుండా సీపీఎం నాయకుల గృహ నిర్బంధం



బల్క్ డ్రగ్‌పార్క్ నిర్మాణం కోసం రాజయ్యపేట సమీపంలో ప్రారంభమైన పనులు

నక్కపల్లి : మండలంలో రాజయ్యపేట పరిసర ప్రాంత గ్రామాల్లో బల్క్ డ్రగ్ పార్క్ పనులు సోమవారం భారీ బందోబస్తు మధ్య ప్రారంభమయ్యాయి. పలు రాష్ట్రాలతో పోటీపడి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధించిన బల్క్ డ్రగ్ పార్క్‌నకు వచ్చే జనవరి 8న భారత ప్రధాని నరేంద్రమోదీతో శంకుస్థాపన చేయించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. జనవరిలో ప్రధాని మోదీ అనకాపల్లి జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు రానున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే బల్క్ డ్రగ్‌పార్క్‌కు కూడా శంకుస్థాపన చేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. పారిశ్రామిక ఖిల్లాగా పేరొందిన అనకాపల్లి జిల్లాలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు గత ఏడాది సెప్టెంబరులో రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ పార్క్ ఏర్పాటయితే ప్రత్యక్షంగా , పరోక్షంగా 10 వేలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

గత ప్రభుత్వంలోనే భూముల కేటాయింపు...

ఈ బల్క్‌డ్రగ్‌పార్క్‌ను తొలుత కాకినాడలో ఏర్పాటు చేయాలని తలపెట్టారు. రూ.2190 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయబోయే ఈ పరిశ్రమకు 2000 ఎకరాల భూమి అవసరమవుతుంది. కాకినాడ జిల్లాలో ఈ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి గత ఏడాది ప్రతిపాదన వెళ్లింది. అయితే ప్రభుత్వ భూములు ఉన్న చోట మాత్రమే ఈ బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సూచించింది. ఈ పార్క్‌ను తమకు కేటాయించాలంటూ పలు రాష్ట్రాలు పోటీ పడ్డాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ ద్వారా ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు కోసం 4500 ఎకరాలు సేకరించిన విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. ఇక్కడ బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు అనుమతిస్తే 2000 ఎకరాలు కేటాయిస్తామని ప్రతిపాదనలు పంపింది. దీంతో కేంద్రం ఈ పార్క్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేటాయించిన 2వేల ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్ కోసం 750 ఎకరాలు, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సదుపాయం, తాగునీరు, వాడుక నీరు వంటి మౌలిక సదుపాయాలకు తోడు వ్యర్థాలను శుద్ధి చేసే ప్లాంట్ల ఏర్పాటుకు 1250 ఎకరాలు వినియోగిస్తారు. మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా కల్పిస్తుంది. ఈ పనుల్లో భాగంగా రాజయ్యపేటలో సర్వే నంబరు 292లో సేకరించిన 244 ఎకరాల జిరాయితీ భూముల్లో పనులు ప్రారంభమయ్యాయి. 30 అడుగుల వెడల్పు కలిగిన ఇంటర్నల్ రోడ్లు 28 కిలోమీటర్ల మేర నిర్మిస్తారు. దీనికి భూములు చదును చేయడం కోసం పొక్లెయిన్‌తో కొబ్బరి తోటలను తొలగిస్తున్నారు. అయితే ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన రైతులకు సంబంధించిన సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న వారికి, డీ ఫారం రైతులకు పరిహారం, ప్యాకేజీ చెల్లించాల్సి ఉందని రైతులు ఆందోళన చేస్తున్నారు.

ముందే హెచ్చరికలు...

ఏపీఐఐసీ చేపట్టిన పనులు అడ్డుకుంటారనే ఉద్దేశంతో అధికార యంత్రాంగం అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. నిర్వాసితులకు అండగా నిలుస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు, మండల కన్వీనర్ రాజేష్ తదితరులను హౌజ్ అరెస్టు చేశారు. నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాలకు చెందిన సీఐలు కుమార స్వామి, అప్పన్న, ఎల్.రామకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 50 మందితో పనులు జరిగే చోట బందోబస్తు ఏర్పాటు చేసారు. పనులు ప్రారంభించే భూములకు పరిహారం చెల్లించినందున పనులు అడ్డుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ముందుగా హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు, నిర్వాసితులు ఆ దరిదాపుల్లోకి రాలేదు. దీంతో పనులు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.

నర్సీపట్నం కౌన్సిల్ సమావేశంపై ఉత్కంఠ

- టీడీపీ వార్డులకు అధికంగా నిధుల కేటాయింపు
- అభ్యంతరం తెలిపిన చైర్‌పర్సన్
- ఎజెండాపై సంతకం చేయని వైనం
- వాయిదా కోరుతూ కమిషనర్‌కు లేఖ



నర్సీపట్నం మున్సిపల్ కార్యాలయం



మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. వాస్తవానికి మంగళవారం బడ్జెట్ సమావేశం జరగాల్సి ఉంది. దీనికి వైఎస్సార్‌సీపీకి చెందిన చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అంగీకారం తెలిపారు. దీంతోపాటు జరగాల్సిన సాధారణ సమావేశం ఎజెండాకు ఆమె అంగీకారం తెలపలేదు. ఎజెండాపై సంతకం చేయలేదు. మున్సిపాలిటీకి వీఎంఆర్‌డీఏ నుంచి సుమారు రూ.4 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులను టీడీపీ వార్డులకు ఎక్కువగా కేటాయిస్తూ అధికారులు ఎజెండాను రూపొందించారు. దీనిపై అభ్యంతరం చెప్పిన చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి నిధులను అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఎజెండాను మార్పు చేసేందుకు వీలు పడదని కమిషనర్ సురేంద్ర చెప్పడంతో చైర్‌పర్సన్ సంతకం చేసేందుకు నిరాకరించారు. 28 మంది కౌన్సిల్ సభ్యులు ఉన్న కౌన్సిల్‌లో వైఎస్సార్‌సీపీ 15 మంది కౌన్సిలర్లు, టీడీపీ 12, జనసేన ఒక కౌన్సిలర్ ఉన్నారు. స్పీకర్‌గా ఉన్న స్థానిక శాసన సభ్యుడు సిహెచ్.అయ్యన్నపాత్రుడు ఎక్స్‌ఫిషియో సభ్యులుగా హాజరయ్యే అవకాశం ఉంది. వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్నికైన ఒకరు టీడీపీకి మద్దతుగా ఉన్నారు. కౌన్సిల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు ఇద్దరు వైఎస్సార్ సీపీకి చెందినవారే. చైర్‌పర్సన్ సంతకం లేని ఎజెండాను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టే అవకాశం లేదు. నేడు కౌన్సిల్ సమావేశంలో సాధారణ ఎజెండా ఉంటుందా లేదా..ఉంటే ఏవిధంగా ఆమోదం పొందుతుందన్న విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

వాయిదా కోరుతూ లేఖ...

నేడు జగరాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయాలని చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి సుబ్బలక్ష్మి కోరారు. భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతితో కేంద్ర ప్రభుత్వం ఏడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. ఈ సమయంలో బడ్జెట్ ప్రవేశపెడితే అలాంటి ఆర్థిక మేధావిని అగౌరపరిచినట్లు అవుతుంది. బడ్జెట్ సమావేశం నిర్వహించడం సరైన నిర్ణయం కాదనని చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి కమిషనర్ సురేంద్రకు సోమవారం అత్యవసరంగా లేఖ పంపారు.

డీలర్ల ఎంపికలో అవకతవకలు !

సాక్షి, అనకాపల్లి : కూటమి ప్రభుత్వంలో ఎఫ్‌పీ షాప్ డీలర్ల ఎంపిక పరీక్షల్లో అవకతవకలు జరిగాయి. అధికారులు ప్రతిభకు అన్యాయం చేసి మెరిట్ లేని వారికి అడ్డదారుల్లో ఉద్యోగాలు కల్పిస్తూ అవకతవకలకు పాల్పడుతున్నారు. ఈ నెల 26న జరిగిన అనకాపల్లి ఎఫ్‌పీ షాప్ డీలర్స్ ఎంపిక పరీక్షలో అధికారులు అవకతవకలకు పాల్పడ్డారు. రాత పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ పేరుతో తక్కువ మార్కులు వేసి తీవ్ర అన్యాయానికి పాల్పడ్డారు. దేవరపు ప్రసాద్ అనే వ్యక్తికి రాత పరీక్షలో 64 మార్కులు వచ్చాయి. ఆయనకు అనకాపల్లి యలమంచిలి - 2 డిపోలో మొదటి స్థానం, అలాగే జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి 10 మందిలో ఒక్కడు. అయితే ప్రసాద్‌కు తరువాత జరిగిన ఇంటర్వ్యూలో అన్ని ప్రశ్నలకు సరియైన సమాధానం చెప్పినప్పటికీ కేవలం 5 మార్కులు మాత్రమే వేసి...మొత్తం (ఫలితంగా)64+5=69 మార్కులతో మెరిట్ లిస్ట్‌లో రెండో స్థానానికి మార్చారు. అదే అతనితో పాటు రాసిన రాత పరీక్షలో 53 మార్కులు మాత్రమే వచ్చిన ఒక వ్యక్తికి ఇంటర్వ్యూలో 18 మార్కులు వేసి 53+18=71 మార్కులతో మొదటి ప్లేస్ ఇచ్చేసారు. యలమంచిలి -2 డిపో మాత్రమే కాకుండా మరి కొన్ని డిపాల్లో కూడా రాత పరీక్షలో అత్యధిక మార్కులు వచ్చినప్పటికి, ఇంటర్వ్యూ లో కేవలం 2, 3, 4 మార్కులు మాత్రమే వేసి కిందికి నెట్టేస్తున్నారు. రాత పరీక్ష మెరిట్లో 4, 5 స్థానంలో ఉన్నప్పటికీ ఇంటర్వ్యూలో 18 మార్కులు ఇవ్వడంతో కింది నుంచి టాప్ స్థానానికి తీసుకొస్తున్నారు. రాజకీయ ఒత్తిడికి లోబడి...అదేవిధంగా అధికారులు చేతివాటం చూపిస్తున్నారు.

జీవన ప్రమాణ ధ్రువపత్రాలు సమర్పించండి

తుమ్మపాల: ప్రభుత్వ పెన్సనార్లు తమ జీవన ప్రమాణ దృవపత్రాలను వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 లోపు జిల్లా ఖజానా, లెక్కల అధికారి వారి కార్యాలయంకు సమర్పించాలని జిల్లా అధికారి వి.యల్.సుభాషిణి తెలిపారు. మీసేవ,ఇంటర్‌నెట్ కేంద్రంలో పింఛనుదారుల సంఘంలో దరఖాస్తు చేసి పొందాలని ఆమె కోరారు.

క్లుప్తంగా

జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడిగా జనార్దన్



తుమ్మపాల : రాష్ట్ర జూనియర్ కళాశాలల మేనేజిమెంట్ నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ హిమశేఖర్ కళాశాల కరస్పాండెంట్ కొణతాల జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా రాపర్తి కృష్ణమోహన్, కోశాధికారిగా కోన సతీష్ ఎన్నికయ్యారు. నర్సీపట్నం రాయల్ రిసార్ట్స్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యవర్గ సమావేశం, గెట్ టు గెదర్ కార్యక్రమంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగిందని జనార్దన్ తెలిపారు. జూనియర్ కళాశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడపా శేషగిరిరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉ.గోవిందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మళ్ల మురళి, రమణాజి, దొరబాబు, జిల్లా పెద్దలు గోవిందరావు, పల్లి శేషగిరిరావు, కోట నాగేశ్వరరావు, ఓ ప్రకాశరావు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

అనకాపల్లి : నేషనల్ హెల్త్ మిషన్‌లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను పర్మనెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రామకృష్ణ అన్నారు. స్థానిక డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సోమవారం ఎన్‌హెచ్‌ఎం నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని డీఎం అండ్ హెచ్‌వో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 2008 నుంచి నేషనల్ హెల్త్ మిషన్‌లో విధులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఉద్యోగుల జీవితాలు మారడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన కోరారు. యూనియన్ అధ్యక్షుడు పెంటకోట జయరాజు, సిబ్బంది పెంటయ్య, రామలక్ష్మి, వి.సూరిఅప్పారావు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో చొరవెక్కడ?

- క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు
- ప్రతి వారం పునరావృతమవుతున్న అర్జీలు

తుమ్మపాల:

అర్జీల పరిష్కారంలో అధికారుల చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తమ సమస్యలకు ఆధారాలతో సహా అర్జీలు పెట్టుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం కారణంగా పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు అర్జీదారులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా ప్రతివారం కలెక్టరేట్‌కు వచ్చి నిరసనలు తెలపడం, పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేసుకోవడం పరిపాటిగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులకు సమస్య తెలియజేసేందుకు వస్తున్న వృద్ధులు, వికలాంగులు, ప్రజా సంఘాల నాయకులపై పోలీసులు ఆంక్షలు విధించి కలెక్టరేట్ బయటే నిలువరించడం, మీడియాను పీజీఆర్ఎస్ వేదిక వద్దకు అనుమతివ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీంతో కలెక్టరేట్ నిరసనలు, ధర్నాలతో ప్రతి సోమవారం దద్దరిల్లిపోతోంది.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు : కలెక్టర్ విజయ కృష్ణన్

పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దని, పరిష్కారానికి సకాలంలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఆమెతో పాటు జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీల గురించి సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. అర్జీల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 206 అర్జీలు నమోదు కాగా.. రెవెన్యూ శాఖకు 135, పంచాయతీరాజ్‌కు 14, పోలీసు శాఖకు 12, సర్వే శాఖకు 7, మున్సిపల్ 6, సివిల్ సప్లై విభాగానికి 4, ఇతర శాఖలకు 28 అర్జీలు అందాయి.

ఎస్పీ కార్యాలయానికి 33 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)కు 33 అర్జీలు వచ్చాయని అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ తెలిపారు. అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్, ఇతర సమస్యలపై ఎక్కువగా అర్జీలు అందాయన్నారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి.వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు తొలగించాలని ఆందోళన



శారదానగర్‌లో మద్యం దుకాణం తొలగించాలంటూ నిరసన తెలుపుతున్న మహిళలు

శారదానగర్‌లో నివాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తక్షణం తొలగించాలని అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ శారదానగర్ మహిళలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ప్రశాంత వాతావరణంలో జీవనం పొందుతున్న తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై మొదటి నుంచి ఉద్యమం చేస్తున్నప్పటికి అధికారులు కనీసం స్పందించడం లేదని వాపోయారు. పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు అనేక సార్లు అర్జీలు అందజేశామని, గత వారం చేసిన ఫిర్యాదుకు కలెక్టర్ స్పందించి దుకాణాన్ని మార్చాలని ఆదేశించినప్పటికీ ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించకపోతే దుకాణం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

'ల్యాండ్ పూలింగ్' రైతులకు ప్లాట్లు మంజూరు చేయాలి



ల్యాండ్ పూలింగ్ పట్టాలు మంజూరు చేయాలని ఆందోళన చేస్తున్న రైతులు

ల్యాండ్ పూలింగ్ పేరిట సేకరించిన భూములకు బదులుగా ప్లాట్లు మంజూరు చేస్తామన్న హామీని నెరవేర్చాలని అనకాపల్లి మండలం పాపయ్యపాలెం, పాపయ్య సంతపాలెం రైతులు కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. పాపయ్యపాలెం సర్వే నంబర్ 174, 175, 176, 177, 178, 179లో మొత్తం 78 ఎకరాలు, పాపయ్య సంతపాలెంలో 78.5 ఎకరాల మేర జీడి మామిడి తోటలు, సాగు భూములను ల్యాండ్ పూలింగ్ పేరిట ప్రభుత్వం సేకరించిందని, దీనికి బదులుగా వుడా లేఅవుట్‌లో ఒక్కో ఎకరానికి 18 సెంట్ల చొప్పున ప్లాట్‌లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని బాధిత రైతులు గుర్తు చేశారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమకు ప్లాట్‌లు మంజూరు చేయడం లేదని బాధిత రైతులు, మహిళలు నిరసన తెలిపారు. తమ భూముల్లో జగనన్న లేఅవుట్‌లు వేసి ఇళ్లు నిర్మించారని, తమకు మాత్రం న్యాయం చేయడం లేదని కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రిజిస్ట్రేషన్‌తో ప్లాట్‌లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.

నష్టపోయిన వరి రైతులను ఆదుకోవాలి



ఆందోళన చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు

ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకుని ఎకరానికి రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు కలెక్టర్‌కు వినతిపత్రం అందించి సమస్యను వివరించారు. జిల్లాలో మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి, అనకాపల్లి, యలమంచిలి, ఎస్.రాయవరం, తదితర మండలాల్లో వరి తడిసిపోయి తీవ్రంగా నష్టం జరిగిందని సంఘం నాయకులు తెలిపారు. గింజ రంగు మారి, మొలకెత్తిందన్నారు. ప్రభుత్వం దృష్టికి రైతుల సమస్యను తీసుకెళ్లి నష్టపరిహారం చెల్లింపునకు చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్టీఆర్ రైతు భరోసా రూ.20 వేలు వెంటనే ఇవ్వాలన్నారు. రంగు మారిన ధాన్యాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న క్వింటాలకు రూ. 2,300 కి అదనంగా రూ.500 కలిపి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.రామ సదాశివరావు, అధ్యక్షుడు ఎస్.బ్రహ్మాజీ, రైతు నాయకులు బుద్ధ రంగారావు, రాము పాల్గొన్నారు.

వైద్యం అందక మహిళ మృతిపై విచారణ

- డిప్యూటీ డీఎంహెచ్‌వో రాకతో ఆస్పత్రికి చేరుకున్న మృతురాలి బంధువులు
- వైద్య సేవల్లో నిర్లక్ష్యం చూపిన సిబ్బందిపై చర్యలకు డిమాండ్

రోలుగుంట: స్థానిక పీహెచ్‌సీలో రోగికి సకాలంలో వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేయడంతో రోలుగుంట గ్రామానికి చెందిన వైదాసు లక్ష్మి ఈ నెల 28 అర్ధరాత్రి మృతి చెందిన విషయం విదితమే. దీనిపై మృతురాలి కటుంబీకులు ఆ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసి, జరిగిన విషాద సంఘటనపై విలేకరులతో మాట్లాడారు. ఈ మేరకు సోమవారం పత్రికల్లో లక్ష్మి మృతిపై వెలువడిన వార్తలపై స్పందించిన జిల్లా ఆరోగ్య శాఖాధికారి ఎం.ఎస్.వి.కె. బాలాజి, నర్సీపట్నం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో వీరజ్యోతికి విచారణ బాధ్యతలు అప్పగించారు. ఆమె సోమవారం పీహెచ్‌సీకి వచ్చి వైద్యురాలు శ్రావణిని ,సిబ్బందిని ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వచ్చిన విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబీకులు వైదాసు గణేష్, శ్రీను, తంగేటి ఆచారి, తంగేటి మణి తదితరులు సుమారు 40 మంది ఆస్పత్రికి చేరుకొని ఆందోళనకు దిగారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే లక్ష్మి మృతి చెందిందని, లక్ష్మి మృతికి కారణమైన నైట్ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కారకులైన సిబ్బందిని పబ్లిక్ విచారణ చేసేవరకూ కదిలేది లేదని 2 గంటల పాటు ఆందోళన చేసి బైఠాయించారు. దీంతో మృతురాలి కుటుంబీకులతో డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడారు. పోలీసులు, తహసీల్దార్ నాగమ్మ కూడా ఇక్కడకు వచ్చి బాధితులతో మాట్లాడారు. అనంతరం డిప్యూటి డీఎంఅండ్‌హెచ్‌వో విలేకరులతో మాట్లాడారు. మృతురాలి కటుంబీకులను, నైట్ డ్యూటీ సిబ్బందిని విచారించడం జరిగిందని, దీనిపై తదుపరి చర్యల కోసం జిల్లా ఆర్యోగశాఖాధికారికి నివేదిస్తానన్నారు.



విచారణ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి

గృహ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్పలరాజు

నక్కపల్లి: రైతులు, నిర్వాసితుల పక్షాన పోరాటం చేస్తున్న నాయకులను గృహ నిర్బంధం చేయడం ద్వారా ఉద్యమాలను ఆపలేరని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు అన్నారు. బల్క్‌డ్రగ్ పార్క్ నిర్మాణం కోసం సోమవారం నుంచి ఏపీఐఐసీ వారు రాజయ్యపేటలో పనులు ప్రారంభిస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న వారికి, డీఫారం రైతులకు నష్టపరిహారం పూర్తిస్థాయిలో చెల్లించలేదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకుండానే పనులు ప్రారంభించడాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నామన్నారు. నిర్వాసితులు, బాధిత రైతులతో కలిసి పనులు అడ్డుకుంటామనే ఉద్దేశంతో ప్రభుత్వం పోలీసులతో తమను గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. తామేమి ఉగ్రవాదులం, దేశద్రోహులం కాదన్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య బల్క్‌డ్రగ్ పార్క్ పనులు ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. రైతులకు గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మాత్రమే చెల్లించాలని కోరుతున్నామన్నారు. ఇవేవీ నెరవేర్చకుండా రైతులను మోసం చేస్తూ తమ ఉద్యమాలను అణిచివేయాలని ప్రయత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుని బాధిత రైతులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు.



ఎస్.రాయవరంలో అప్పలరాజును గృహ నిర్బంధంలో ఉంచిన పోలీసులు

లక్ష్యాలను చేరండి..



- అధికారులతో కలెక్టర్ విజయకృష్ణన్ సమీక్ష

సాక్షి, అనకాపల్లి : మీకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులందరికీ జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ, సంక్షేమ శాఖల అధికారులు, మండల అభివృద్ధి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను, సాధించిన వివరాలను అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. పంట నష్టపోయినపుడు రైతుకు పరిహారం అందకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కె.కోటపాడు మండలంలో పండ్లు, కూరగాయల క్లస్టరుగా, దేవరాపల్లి మండలంలో మాంస ఉత్పత్తుల క్లష్టరుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించి, పదో తరగతి పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టరు సూచించారు.

మామిడి పంట బీమా చెల్లింపునకు నేడే గడువు

అనకాపల్లి : మామిడి పంటకు బీమా ప్రీమియం ఎకరాకు రూ.2,200 ఈ నెల 31లోపు చెల్లించాలని జిల్లా ఉద్యానశాఖాధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. ప్రీమియం చెల్లించి 2024–25 రబీ సీజన్‌కు బీమా పొందాలని తెలిపారు. జిల్లాలో ఇ-పంటలో నమోదు చేయించుకున్న రైతులందరూ 2024–25 ఏడాది పంటకు బీమా చెల్లింపునకు అర్హులేనని తెలిపారు.

న్యాయవాది మృతిని నిరసిస్తూ విధుల బహిష్కరణ



నర్సీపట్నం కోర్టు ప్రధాన గేటు వద్ద ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి/నర్సీపట్నం: అనంతపురం జిల్లాలో పోలీసు స్టేషన్లో న్యాయవాది వి.వి.శేషాద్రి మృతిని నిరసిస్తూ అనకాపల్లి, నర్సీపట్నంలో న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి కోర్టు విధులను బహిష్కరించారు. సోమవారం ఆయా కోర్టుల మెయిన్ గేటు వరకు ప్రదర్శన నిర్వహించి ఆందోళన చేపట్టారు. న్యాయవాది మృతికి కారకులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి, నర్సీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జె.వి.ఎస్.కుమార్, మెట్టా ప్రభాకర్, అనిమిరెడ్డి శివకృష్ణ మాట్లాడుతూ పోలీసు హింసాత్మక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులకు సివిల్ కేసు సంబంధం లేదని వివరణ ఇచ్చిన న్యాయవాదిపై అప్రజాస్వామికంగా ప్రవర్తించి వేధింపులకు గురిచేశారన్నారు. పోలీసుల సివిల్ సెటిల్‌మెంట్లను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో అనకాపల్లి బార్ అసోసియేషన్ కార్యదర్శి దుర్గారావు, సీనియర్ న్యాయవాదులు కె.చంద్రశేఖర్, కె.నాయుడు, శ్రీనివాసరావు, కేశవ, నర్సీపట్నం న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కార్యదర్శిగా శ్రావణ్



నర్సీపట్నం: పట్టణానికి చెందిన వ్యాపారి సుతాపల్లి శ్రావణ్ ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇటీవల ఈయన ఈ పదవికి నామినేషన్ వేయగా, సోమవారం ఎంపికై నట్లు స్టేట్ ప్రెసిడెంట్ వి.భాస్కరరావు ప్రకటించారు. శ్రావణ్ ఎంపికపై నర్సీపట్నం చాంబర్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో మూడు పతకాలు

- రాష్ట్ర స్థాయి పరుగు పోటీల్లో సత్తా చాటిన గడి లక్ష్మి

దేవరాపల్లి : రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో దేవరాపల్లి మండలం కాశీపురానికి చెందిన గడి లక్ష్మి సత్తా చాటింది. గుంటూరులోని బృందావన గార్డెన్స్ ఎన్‌టీఆర్ స్టేడియంలో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ కనబరిచింది. 50 సంవత్సరాల వయసు పైబడిన విభాగంలో 1500 రన్నింగ్‌లో గోల్డ్ మెడల్‌ను లక్ష్మి కైవసం చేసుకున్నారు. 800 మీటర్ల రన్నింగ్ ద్వితీయ స్థానంలోను, 200 మీటర్ల రన్నింగ్‌లో తృతీయ స్థానం నిలిచి సిల్వర్ మెడల్స్‌ను సొంతం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన లక్ష్మికి మండల ప్రజలతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, అథ్లెటిక్స్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.



గోల్డ్ మెడల్‌ను అందుకుంటున్న గడి లక్ష్మి

తిరిగి..తిరిగి విసిగి వేసారి...

- పీజీఆర్ఎస్‌లో అర్జీ ఇవ్వడానికి వచ్చి ఆత్మహత్యాయత్నం
- గోంగూర తోటకని చెప్పి అనకాపల్లిలో పురుగు మందు కొనుగోలు

సాక్షి, అనకాపల్లి : కాలిపోయిన ఇంటికి పరిహారం కోసం స్థానిక రెవెన్యూ అధికారులకు చాలామార్లు దరఖాస్తు చేసుకున్నాడు.. పరిహారం అందకపోవడంతో జూలైలో కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. అయినా నేటి వరకూ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో మనస్తాపానికి గురై అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్(ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతి అందించి అక్కడికక్కడే కూలిపోయాడు. తూటిపాలకు చెందిన అనిమిరెడ్డి రమణ అనే వ్యక్తి సోమవారం కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం సృష్టించింది. ఆ సమయంలో డీసీహెచ్ శ్రీనివాసరావు అక్కడే ఉండడంతో బాధితుడిని ఎన్‌టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి సకాలంలో తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం రమణ ఆరోగ్యం నిలకడగానే ఉందని ఎన్‌టీఆర్ వైద్యులు వెల్లడించారు.

గోంగూర తోటకోసమని...

సోమవారం ఉదయం 10 గంటలకు అనకాపల్లికి వచ్చిన రమణ కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న షాపులో గోంగూర తోటకు చిత్త పటేసింది.. అది పోవడానికి పురుగుమందు కొనుక్కొని కలెక్టర్ సమీపంలో తాగి పీజీఆర్ఎస్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం 12.30 సమయం కావడంతో అర్జీదారులు తక్కువగా ఉండడంతో రిజిస్ట్రేషన్ త్వరగా చేసుకుని నేరుగా కలెక్టర్‌కు వినతి అందజేసి నోటి నుంచి నురుగ కక్కుకుంటూ అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. కిందపడిపోయిన రమణను చూసి కలెక్టర్‌తో పాటు అధికారులంతా తొలుత ఫిట్స్ వచ్చి పడిపోయాడని అనుకున్నారు. వెంటనే అక్కడే ఉన్న డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ పరిక్షించి పాయిజన్ తీసుకున్నట్టుగా గ్రహించి ఆటోలో ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు.



ఎన్‌టీఆర్ ఆస్పత్రిలో రమణకు రూ.8 వేలు చెక్ అందజేస్తున్న ఆర్‌డీవో షేక్ ఆయిషా

బాధితుడికి రూ.8 వేలు పరిహారం

సాక్షి, అనకాపల్లి : ఆత్మహత్యాయత్నం చేసిన రమణకు కలెక్టరు రూ.8వేలు పరిహారం ప్రకటించారు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో అనకాపల్లి ఆర్‌డీఓ షేక్ ఆయిషా ఎన్‌టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమణను పరామర్శించారు. బాధితుడి సమస్యపై తక్షణ చర్యలు తీసుకొని ఇల్లు కాలిపోయినందుకు నష్టపరిహారం రూ.8000 చెక్కును ఆయనకు అందజేసారు. గతంలో స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు రావడం నిజమేనని, నష్టపరిహారం కూడా మంజూరు చేయడం జరిగిందని..కాకపోతే సహజ విపత్తుల పరిహార హెడ్ ఆఫ్ అక్కౌంటు లేనందున బిల్లు ట్రెజరీకి సమర్పించలేదని వెల్లడించారు. హెడ్ ఆఫ్ అకౌంటు మ్యాపింగ్ అయిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్‌డీవో తెలియజేశారు.

పట్టా ఉంటేనే పరిహారం అన్నారు...

అనిమిరెడ్డి రమణ నాకు మేనమామ అవుతాడు. ఆయనకు గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ఇందిరమ్మ కాలనీలో స్థలం ఇచ్చారు. ఇప్పుడు పట్టా లేకుండా ప్రభుత్వ భూమి ఆక్రమించారంటూ నష్ట పరిహారం ఇవ్వడం లేదు. గ్రామ వీఆర్‌వో నుంచి ఎమ్మార్వో వరకూ అందరూ ఇంటి పట్టా ఉంటేనే నష్ట పరిహారం ఇస్తామంటున్నారు. ఇంటిలో పట్టా, బట్టలు అన్నీ కాలిపోయాయి.. అని చెప్పినా నమ్మడం లేదు. ఇప్పటికైనా కలెక్టర్ మేడమ్ స్పందించాలని కోరుతున్నాం.

– గొర్లి వరలక్ష్మి, తీడ గ్రామం, కశింకోట మండలం

పలు రైళ్ల నెంబర్లు మార్పు

తాటిచెట్లపాలెం: ఇప్పటివరకు మెము స్పెషల్, పాసింజర్ స్పెషల్స్‌గా నడిచిన పలు రైళ్లు జనవరి 1వ తేదీ నుంచి కొత్త రైలు నెంబర్లతో రెగ్యులర్ పాసింజర్ రైళ్లుగా ప్రయాణించనున్నాయి.

రైలు పేరు	పాత నంబరు	కొత్త నంబరు
కటక్-గుణుపూర్ పాసింజర్	08421	68433
గుణుపూర్-కటక్ పాసింజర్	08422	68434
విశాఖపట్నం - కిరండూల్ పాసింజర్	08551	58501
కిరండూల్-విశాఖపట్నం పాసింజర్	08552	58502
విశాఖపట్నం-రాయ్‌పూర్ పాసింజర్	08528	58528
రాయ్‌పూర్-విశాఖపట్నం పాసింజర్	08527	58527
విశాఖపట్నం-కోరాపుట్ పాసింజర్	08546	58538
కోరాపుట్-విశాఖపట్నం పాసింజర్	08545	58537
విశాఖపట్నం-బ్రహ్మపూర్ పాసింజర్	08531	58532
బ్రహ్మపూర్-విశాఖపట్నం పాసింజర్	08532	58531
విశాఖపట్నం-గుణుపూర్ పాసింజర్	08522	58506
గుణుపూర్-విశాఖపట్నం పాసింజర్	08521	58505
విశాఖపట్నం-భవానిపట్న పాసింజర్	08504	58504
భవానిపట్నం-విశాఖపట్నం పాసింజర్	08503	58503

క్లుప్తంగా

నేడు పన్నుల చెల్లింపులు

అనకాపల్లి: జోన్ పరిధిలో ఆర్థిక సంవత్సరం ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్నులను ఈ నెల 31న ఎటువంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చని జోనల్ రెవెన్యూ అధికారి ఎల్.సురేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సచివాలయాలు, జోనల్ కార్యాలయంలో పన్నులు స్వీకరిస్తున్నట్లు ఆయన చెప్పారు.

దళితుల జాబితా ప్రదర్శనను పొడిగించాలి

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల పంచాయతీ పరిధిలో గల సచివాలయాల్లో దళితుల జాబితా ప్రదర్శనను కొనసాగించాలని తుమ్మపాల ఇందిరానగర్ రెల్లివీధి పెద్దలు బంగారు వెంకటేశ్వరరావు, కోన అప్పారావు, చంద్రుడు, ముత్యాల నూకరాజు, భూపతి ఈశ్వరరావు సోమవారం ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. సచివాలయాల్లో దళితుల జాబితాను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లుగా వచ్చిన సమాచారం చాలా మంది దళితులకు తెలియని కారణంగా ఈ నెల 31 నుంచి మరో పది రోజులు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ



పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న నాయకులు

కశింకోట: మడలంలోని జి.భీమవరం ప్రాథమిక పాఠశాలలో సోమవారం పొట్టి శ్రీరాములు సేవా సంస్థ సహకారంతో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తలుపులు రాజు, కూటమి నాయకులు కాయల మురళీధర్, అప్పికొండ అప్పారావు, అయినాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో వ్యక్తికి రిమాండ్

సబ్బవరం: గంజాయి కేసులో పరారైన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. 2022లో సబ్బవరం మీదుగా గంజాయి తరలిస్తూ 8వ నిందితుడైన జి.మాడుగుల మండలం జీలిగుగొయ్య గ్రామానికి చెందిన బంటూరి మోదేశ్వరరావు(48) అలియాస్ మోజేష్ తప్పించుకున్నాడు. తన అన్న రాంబాబుతో కలిసి గ్రామంలో గంజాయి పండిస్తుండేవాడు. మోజేష్ అన్న రాంబాబును, గంజాయి కొనుగోలు చేసిన సాలాపు వరహాలబాబును ఇదివరకే అరెస్టు చేశారు. తప్పించుకున్న మోజేష్ కూడా దొరకడంతో అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు సీఐ వెల్లడించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 3,474 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,800
మొదటి రకం	3,760	4,300
రెండో రకం	3,480	3,960
మూడో రకం	3,280	3,460

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	సత్యనారాయణ స్క్రీన్-2
యూఐ	పర్తిసాయి
మ్యాక్స్	షిర్డీసాయి
శ్రీకాకుళం షెర్లాక్ హోమ్	వెంకటేశ్వర
అమరన్	శ్రీసత్య
డ్రింకర్ సాయి	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 48 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8, బీ పాజిటివ్-15, ఓ పాజిటివ్-23, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల చొప్పున శుద్ధి చేసిన రక్తం నిల్వ అందుబాటులో ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్‌ను 97036 19706 నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

భయం భయం..!

- పట్టణంలో ప్రమాదాలకు నిలయంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- కానరాని రక్షణ చర్యలు
- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ వ్యాపారాలు
- అధికారులు పట్టించుకోవాలని స్థానికుల విజ్ఞప్తి



మెయిన్ రోడ్డు పెరుగుబజార్ జంక్షన్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ వ్యాపారాలు



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కప్పిన బోర్డులు



తహసీల్దార్ కార్యాలయం రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

అనకాపల్లి: గత వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లాల వికేంద్రీకరణతో అనకాపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పడ్డాక పట్టణ పరిధిలో సుమారుగా 2.21 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. జిల్లా కేంద్రంగా వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఉన్నత స్థాయి అధికారులు పట్టణంలో నివసించడంతో రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరిగింది. జనాభాకు తగ్గట్టుగా విద్యుత్ శాఖ అధికారులు ఓవర్ లోడ్‌ను దృష్టిలో పెట్టుకుని కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణ పరిధిలో విద్యుత్ శాఖ డీ-1, డీ-2 విభాగాలను గతంలోనే ఏర్పాటు చేసి ప్రజలకు విద్యుత్ సరఫరా చేస్తోంది. డీ-1 సెక్షన్‌లో సుమారుగా 440, డీ-2 పరిధిలో సుమారుగా 380 కలిపి మొత్తం 820 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఇందులో కొన్ని ప్రమాదాలకు నిలయంగా మారాయి.

ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణేది..?

పట్టణ పరిధిలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సరైన రక్షణ లేకపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయం భయంగా స్థానిక ప్రజలు జీవిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. చిన్న పిల్లలకు సైతం అందే ఎత్తులో అవి ఉన్నాయి. కనీసం వీటి చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఒక పక్కకు ఒరిగిపోయి ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారించి ఎవరూ ప్రమాదాలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

పట్టణంలో ఇదీ పరిస్థితి..

- పట్టణ పరిధిలో ఎక్కువగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం పట్టణానికి వేలాది మంది విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.
- పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో రహదారుల పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేస్తే ఎటువంటి ప్రమాదాలు జరగవని ఆయా ప్రాంతాల ప్రజలు సూచిస్తున్నారు.
- కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు నిర్మించిన దిమ్మలు శిథిలావస్థకు చేరుకోవడంతో అవి పక్కకు ఒరిగిపోయాయి.
- మెయిన్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కొంత మంది చిన్నపాటి షెడ్‌లు నిర్మించి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఎప్పుడైనా ప్రమాదం సంభవించినట్లయితే తీవ్రమైన ప్రాణనష్టం జరుగుతుంది.
- విద్యుత్ తీగలపై పిచ్చి మొక్కలు పెరగడంతో కొన్ని ప్రాంతాల్లో షార్ట్ సర్క్యూట్ అయి గృహాల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు పాడైన అనేక ఘటనలు పట్టణ పరిధిలో జరిగాయి.
- గృహాల మధ్య ఎక్కువ లోడ్‌లలో నిర్వహించే పెద్ద పెద్ద ఆయిల్ మిల్స్, చిన్నపాటి కంపెనీలు ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల్లో హై, లో ఓల్టేజ్ సమస్యలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్యలపై విద్యుత్‌శాఖ అధికారులు దృష్టి సారించి పరిష్కరిస్తే ఎంతో మేలు జరుగుతుంది.

ట్రాన్స్‌ఫార్మర్లను చూస్తే భయమేస్తోంది



పట్టణ పరిధిలోని అన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను చూస్తే భయమేస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. కనీసం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్న ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ కంచె వస్తే బాగుంటుంది. విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారించాలి.

– కె.రాము, గవరపాలెం, అనకాపల్లి

రక్షణ చర్యలు తీసుకోండి



జనాభాకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ సరైన రక్షణ లేకుండా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లో దిమ్మల పైన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు నేలపై వేలాడుతూ ఉన్నాయి. వర్షాలు పడే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

– వి.తాతయ్యలు, మెయిన్ రోడ్డు, అనకాపల్లి

మా దృష్టికి తీసుకురండి

ప్రజలకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నాం. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు సమస్యాత్మకంగా, ప్రమాదకరంగా ఉన్నట్లయితే మా దృష్టికి తీసుకొచ్చిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– విద్యుత్ శాఖ డీ-1, డీ-2 ఏఈలు, అనకాపల్లి పట్టణం

ప్రశాంతంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోండి

అనకాపల్లి: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని పట్టణ సీఐ టి.వి.విజయకుమార్, రూరల్ సీఐ అశోక్‌కుమార్‌లు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఎటువంటి అనుమతులు లేకుండా డీజే పెట్టకూడదని, ఓపెన్ డ్రింకింగ్‌లు, ప్రజలు గుమిగూడటం, బైకులు స్పీడ్‌గా నడపడం, బాణాసంచా కాల్చడం నిషేధమన్నారు. అశ్లీల నృత్యాలు చేయడం చట్టపరమైన నేరమని, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు మీరితే చర్యలు

కశింకోట: న్యూ ఇయర్‌ను పురస్కరించుకొని మద్యం తాగి వాహనాలు నడపడం చేయరాదని సీఐ అల్లు స్వామినాయుడు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 31, వచ్చే ఏడాది జనవరి 1న మండల పరిధిలో ఉన్న దాబాలు, రెస్టారెంట్లలో ఎటువంటి మద్యం అనుమతించ రాదని నిర్వాహకులను హెచ్చరించారు. ఆకతాయిలు తమ బైక్ సైలెన్సర్లను తొలగించి అధిక ధ్వని చేస్తే చర్యలు తప్పవన్నారు. అశ్లీల నృత్యాలు, హింసాత్మక ఘటనలకు పాల్పడరాదన్నారు. వాహనాలు డ్రైవ్ చేసినప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. నిబంధనలు మీరితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిలకడగా కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా ధర తగ్గుముఖం పట్టింది. గత వారం కిలో రూ.30 ఉండగా.. ఈ వారం రూ.20కు తగ్గింది. నాణ్యతను అనుసరించి మూడు కిలోలు రూ.50కి విక్రయించారు. ఈ సారి నాటు టమాటా ఎక్కువగా అమ్మకానికి వచ్చింది. హోల్‌సేల్‌గా క్రేట్ గత వారం రూ.600 ఉండగా.. ఈ వారం దాదాపు సగం తగ్గి రూ.350కు అమ్మకాలు సాగాయి. వంకాయ, బెండకాయ మాత్రం బెట్టు మీదున్నాయి. కిలో రూ.60కు విక్రయించారు. బీరకాయ, దొండకాయ, గోరు చిక్కుడు ఇదే ధరకు విక్రయించారు. ఉల్లిపాయ, బంగాళాదుంప ఎప్పటిలాగే రూ.40కు విక్రయాలు సాగాయి. పాదు చిక్కుడు, బీట్రూట్, క్యారెట్ రూ.80, క్యాప్సికం రూ.వందకు అమ్మకాలు జరిగాయి.

తగ్గిన మేకలు, గొర్రెల అమ్మకాలు



తాళ్లపాలెం వారపు సంతలో అరకొరగా సాగుతున్న మేకలు, గొర్రెల విక్రయాలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం మేకలు, గొర్రెల అమ్మకాలు తగ్గాయి. అవి సంతకు రావడం కూడా తక్కువే వచ్చాయి. ప్రస్తుతం తుపాను తర్వాత తెరిపివ్వడంతో ఖరీఫ్ వరి కోతలు కావడంతో వీటిని ఎక్కువగా కొనుగోలు చేసే రైతులు, ప్రజలు రాలేదు. దీంతో వీటి అమ్మకాలు తగ్గిపోయాయి. వీటిని ఉభయ విశాఖ, కాకినాడ జిల్లాల నుంచి తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. సంక్రాంతి, ఉగాది, దసరా, దీపావళి పండగ సమయాల్లో మేకలు, గొర్రెలు ఎక్కువగా సంతకు విక్రయానికి వస్తుంటాయి. మిగిలిన సాధారణ వారపు సంతకు వెయ్యి వరకు ఇవి అమ్మకానికి వస్తాయి. ఈ వారం కేవలం 750 వరకు మాత్రమే వచ్చాయి. వాటిని విశాఖ, గాజువాక, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు కొనుగోలు చేశారు. ప్రజలు, రైతులు కొనుగోలు చేస్తేనే ఇవి ఎక్కువ అమ్మకాలు జరుగుతుంటాయి. వర్షాలు పోయిన తర్వాత ఆకాశం తెరిపివ్వడం, ఎండ కాస్తుండటంతో ముమ్మరంగా వరి కోతలు కోయడంపై రైతులు, ప్రజలు ప్రస్తుతం దృష్టి సారించారు. దీంతో వారు తీరిక లేక రాకపోవడం వల్ల దాదాపు సగం కూడా అమ్మకాలు సాగలేదు. పెంపకం రైతులు, వ్యాపారులు నిరాశతో ఇళ్లకు వాటిని తీసుకుపోయారు. ఆశీలు వసూలు కూడా తగ్గిపోయింది. ఒక్కొక్క జీవానికి రూ.30 వసూలు చేస్తారు. వాటిని కొనుగోలు చేసిన వారు వ్యాన్‌లో తీసుకెళ్తే రూ.50, ఆటోలో అయితే రూ.30 వంతున కూడా వసూలు చేస్తారు. అమ్మకాలు తక్కువగా జరగడం, వాటి రాక తక్కువగా ఉండటంతో ఆశీలు కూడా తక్కువ వసూలు అయి నష్టం వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు. కార్తీక మాసం, పండగలు వగైరా లేకపోవడంతో వీటి రాక, అమ్మకాలు రెండు నెలలుగా తగ్గిపోయాయని, దీంతో మరింతగా నష్టాలు చవి చూడాల్సి వస్తోందంటున్నారు. సంక్రాంతి తర్వాత పండగలు, తీర్థాలు ముమ్మరంగా జరిగే అవకాశం ఉన్నందున అప్పటి వారాల్లో జరగనున్న సంతలో వీటి అమ్మకాలు పెరిగి ఆశాజనకంగా ఉండగలదని ఆశిస్తున్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్



నెహ్రూచౌక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లోకనాథం

అనకాపల్లి: రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై రాజ్యసభలో అప్రతిష్ఠాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యసభలో అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తినా.. అమిత్ షా, ప్రధాని నరేంద్రమోదీలు నైతిక బాధ్యత వహించడం లేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ మాట్లాడుతూ రాజ్యాంగంపై, అంబేడ్కర్‌పై మోదీకి గౌరవం ఉంటే అమిత్ షాను బర్తరఫ్ చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ నామాన్ని స్మరించవద్దని అమిత్ షా పార్లమెంట్‌లో చెప్పడం అత్యంత దుర్మార్గమన్నారు. అమిత్ షా, ప్రధాని మోదీ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.దొరబాబు, ఎం.రామునాయుడు, ఆర్.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, నాయకులు పి.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, కె.అప్పలరాజు, జి.సుభాషిణి, ఎం.రమణ, పి.చలపతి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి



మాట్లాడుతున్న రాష్ట్ర దీక్షా సమన్వయకర్త ఇస్మాయిల్

కశింకోట: స్కూల్ నిర్వహణ కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర దీక్షా సమన్వయకర్త టి.ఇస్మాయిల్ కోరారు. కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం జిల్లా స్థాయిలో స్కూళ్ల నిర్వహణ కమిటీ, మండలానికి ముగ్గురేసి ఉపాధ్యాయులకు కలిపి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ నిర్వహణ కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు రూపాయికి బొమ్మా, బొరుసు లాంటి వారని, వారిద్దరు కలిసి పని చేసి పాఠశాల అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ల విధులు, బాధ్యతలను వివరించారు. వారి వివరాలను ఆన్‌లైన్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలో తెలియజేశారు. కార్యక్రమంలో సీఎంవో సిహెచ్.ఎస్.దొర, రాష్ట్ర రిసోర్స్ పర్సన్, హెచ్ఎం ఎం.ఆర్.వి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన హైస్కూల్‌లో మొక్కల పెంపకం



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పీడీ పూర్ణిమాదేవి, ఎంపీపీ సూరిబాబు, నరసింహారావు

అనకాపల్లి: మండలంలోని అక్కిరెడ్డిపాలెం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీ నూతన హైస్కూల్ భవనం చుట్టూ రూ.5 లక్షల విలువల చేసే మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు డ్వామా పీడీ పూర్ణిమాదేవి, ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. పచ్చదనం-పరిశుభ్రతలో భాగంగా సోమవారం నూతన హైస్కూల్ భవనం చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైస్కూల్ భవనం చుట్టూ మొక్కలు నాటి, వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాలో చిన్నారి ప్రతిభ



బాలిక దైవార్జనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రూపానంది

కశింకోట: కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని ముత్యాల దైవార్జన అంతర్జాతీయ యోగా కప్ పోటీల్లో ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచింది. విశాఖలో యూనివర్సల్ యోగా స్పోర్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలో విజయం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థిని దైవార్జనను ప్రిన్సిపాల్ రూపనంది, స్కూల్ అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

'సూపర్ సిక్స్' అమలులో కూటమి విఫలం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

అనకాపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు మాసాలు అవుతున్నప్పటికీ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడం అన్యాయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు తప్పుపడితే ఎదురుదాడికి బీజేపీ నాయకులు దిగుతున్నారని, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై వారికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని చెబుతూ, దేశ సంపదను కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందాల్సిన హక్కులను కాలరాస్తుందని దుయ్యబట్టారు. సీపీఐ శత వార్షికోత్సవాలు సందర్భంగా దేశంలో ఉన్న సమస్యల పట్ల గ్రామీణ స్థాయి నుంచి దేశస్థాయి వరకూ ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చి ఉద్యమాల బాట పట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు, జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి రాజన దొరబాబు, మాకిరెడ్డి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవొద్దు



నెహ్రూచౌక్‌లో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దిన వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: విద్యార్థులు, యువత మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, నూతన సంవత్సర వేడుకలను స్వగృహాల్లో కుటుంబ సమేతంగా జరుపుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాలాజీ, ఎం.రమణ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక నెహ్రూచౌక్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు అసంఘటిత కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, రోడ్డు ప్రమాదం జరిగితే కుటుంబం, బంధుమిత్రులు తీవ్ర క్షోభకు గురవుతారన్నారు. న్యూ ఇయర్ కొత్త స్ఫూర్తిని విద్యార్థులు నింపాలని, ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు, యువకులు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.గౌతమ్, సభ్యులు ఎం.వినయ్, నూకరాజు, విజయ్, కృపానంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: రైతుల సాగులో ఉన్న 2013 భూసేకరణ చట్టప్రకారం సాగుభూములకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ప్రభుత్వం తలపెట్టిన బల్క్‌డ్రగ్స్ కంపెనీ కోసం నక్కపల్లి మండలంలోని భూముల్లో చెట్లు, తుప్పలు, గృహాలు కోల్పోయిన రైతులకు తక్షణం నష్టపరిహారం చెల్లించాలని సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. బల్క్‌డ్రగ్స్ కంపెనీ ఏర్పాటు చేయడంలో భూములు కోల్పోయిన రైతులకు చట్టప్రకారం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు డి.వెంకన్న, ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, గంటా శ్రీరామ్, జిల్లా ఐద్వా కమిటీ సభ్యులు బి.ప్రభావతి, డి.డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిపో ఎదుట ఎర్రబ్యాడ్జీలతో నిరసన



ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న యూనియన్ సభ్యులు, ఉద్యోగులు

అనకాపల్లి: ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ)లో రూట్ సర్వేలు చేసి బస్‌ల రన్నింగ్ టైమ్‌ను పెంచాలని ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి జి.వి.రమణ కోరారు. యూనియన్ జోనల్ కమిటీ పిలుపు మేరకు సోమవారం ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. స్థానిక డిపో గేటు వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్క్యులర్ నంబర్ 1/2019ను అమలు చేయాలని, చిన్నపాటి సమస్యలను చూపించి ఉద్యోగులను విధుల నుంచి తొలగించడం అన్యాయమని తదితర డిమాండ్లతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో డిపో యూనియన్ నాయకులు కె.ఎం.రావు, రాజు, కె.ఎస్.రావు, జి.ఎస్.ఎల్.ఈశ్వరి, ఎ.ఆర్.కళా తదితరులు పాల్గొన్నారు.